క్లుప్తంగా

జగనన్నా.. కృతజ్ఞతలన్నా..



నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా కనపర్రు గ్రామానికి చెందిన గుంజి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజినితో కలిసి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా, 2019లో చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్‌గా, పార్టీ గ్రామ ఇన్‌చార్జిగా పనిచేశారు. శ్రీనివాసరావు నియామకంపై మండల పార్టీ అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, జిల్లా నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, మద్దూరి కోటిరెడ్డి అభినందించారు.

దాతల సహకారం అభినందనీయం



శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలు అభ్యున్నతికి దాతల సహకారం అభినందనీయమని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ అన్నారు. గురువారం మండలంలోని పోట్లూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి దాతలు ఏర్పాటు చేసిన స్టీలు ప్లేట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు పూర్వ విద్యార్థులు చేయూత ద్వారా పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించటం మంచి శుభాపరిణామమన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి చింతా శ్రీనివాసరావు, గాలి ఏడుకొండలు (ఎస్సై) కుటుంబ సభ్యుల సారథ్యంలో విద్యార్థులకు స్టీలు ప్లేట్లు వితరణ చేశారు. దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ చింతా సైదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ



వినుకొండ: ఆర్థికంగా వెనుకబడిన పేద బ్రాహణులకు చేయూత అందించడం బాధ్యతగా భావించాలని బ్రాహ్మణ పెద్దలు మంత్రిరాజు సత్యనారాయణ అన్నారు. బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భాగవతుల రవికుమార్ అనురాధల ఆధ్వర్యంలో సరకులు అందజేశారు. దాతలను పి.వి. సురేష్ బాబు, గాలి శ్రీనివాసరావులు అభినందించారు. కార్యక్రమంలో జనార్దనాచార్యులు, అన్నాప్రగడ వెంకటేశ్వర రావు, చింతలచెర్వు రఘు, బుచ్చిరాజు పాల్గొన్నారు.

శావల్యాపురంలో వారాహీ నవరాత్రి పూజలు ఆరంభం



శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో శ్రీ వారాహీ మాతా నవరాత్రి వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాల నరసింహా రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారాహీ నవరాత్రి వేడుకలు వచ్చేనెల 4 వరకు జరుగుతాయన్నారు. ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ సారథ్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూలమాలల వేసి మహిళా భక్తులచే కుంకుమాభిషేకం, అభిషేకాలు అర్చనలు విశేష పూజలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, కొర్నెపల్లి సాంబశివరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్
- పలుచోట్ల అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- వేర్వేరు ప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు



సొలస జెడ్పీ హైస్కూల్లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ



నరసరావుపేటలో ఫ్లేకార్డ్స్‌తో అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్



నూజెండ్లలో నిర్వహించిన మానవహారం



నాదెండ్ల ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

నరసరావుపేట రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని ఏరియా వైద్యశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌కుమార్, కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ బాబు, డాక్టర్ జి.పార్థసారధి రాజు, డాక్టర్ జె.సురేష్ బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.జయకరుణ, హెడ్ నర్స్ పి.విజయకుమారిలు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగించడం వలన కలిగే మానసిక, శారీరక నష్టాలు వివరిస్తూ క్యాడెట్స్ కరపత్రాలను పంపిణీ చేశారు.

వినుకొండలో...

వినుకొండ: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వినుకొండ ఎక్సైజ్ స్టేషను ఆధ్వర్యంలో డ్రగ్స్, మత్తు పదార్థాలవల్ల జరిగే అనర్థాలను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సి.ఐ డి.శ్రీనివాసరావుతోపాటు స్టేషను సిబ్బంది పాల్గొని మార్కాపురం రోడ్డులో కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరదాగా ప్రారంభమయ్యే వ్యసనాలు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటాయని హెచ్చరించారు. గంజాయి, హెరాయిన్, నాటుసారా, కొకై యిన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటికి అలవాటు పడితే యువత జీవితాలు నాశనమౌతాయని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారు అవి దొరకని పరిస్థితుల్లో దొంగతనాలు వంటి తప్పుడు మార్గాల్లో నడుస్తున్నారని, ఆరోగ్యం దెబ్బ తినడంతోపాటు నేరస్తులుగా సంఘ విద్రోహశక్తులుగా మారే అవకాశం ఉందని అన్నారు. డగ్స్ వాడినా, అమ్మినా ఎన్.డి.పి.ఎస్ చట్టం ప్రకారం శిక్షార్హులని తెలిపారు. ఇలాంటి కేసులు నమోదైతే పాస్‌పోర్టు, ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా అనర్హులుగా మిగిలిపోతారని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎడిక్షన్ సెంటర్ సంప్రదించాలి

నరసరావుపేట: డ్రగ్స్ బాధితులు సహాయం కోసం ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ ఎడిక్షన్ సెంటర్‌ను సంప్రదించాలని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వాసుపత్రిలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. దీనికి సంబంధించిన పోస్టర్లు ప్రదర్శించారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారి నిర్మూలన కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ బానిసత్వ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈ రోజు ప్రాముఖ్యత గురించి వివరించారు. డాక్టర్లు పార్థసారధి, సతీష్, పవిత్ర, షారన్, కిరణ్మయి, నర్సులతో పాటు పోలీసు అధికారులు, వైద్య విద్యార్థులు, ఫార్మా, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

సొలసలో...

యడ్లపాడు: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలను నాశనం చేసుకోవడమేనని ఐసీడీఎస్ సొలస సెక్టార్ సూపర్‌వైజర్ వి.అరుణ తెలిపారు. మండలంలోని సొలస గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌డేను నిర్వహించారు. ముందుగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మత్తు పదార్థాల వినయోగం వాటి వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. హైస్కూల్ హెచ్‌ఎం ఎ వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.కోమలి, డి.అఖిల పాల్గొన్నారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ నిర్మలా లక్ష్మీకుమారి, వైద్యాధికారులు జ్ఞానేశ్వరి, ప్రసాద్‌నాయక్, ఎంఈవో కృష్ణారెడ్డి, ఏపీఎం రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా తీవ్రమైన నేరమన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి ప్రమాదకర మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషకుమారి, పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు, సీసీ సాంబశివరావు, వీఆర్వోలు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: యువత డ్రగ్స్ వినియోగించి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తహసీల్దార్ బి.నిర్మల సూచించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, ఎండీవో మాధ్యుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడితే వ్యక్తి జీవితం చిన్నాభిన్నమవుతుందని తెలిపారు. మాదక ద్రవ్యాలను ఒక్కసారి అలవాటు చేసుకుంటే దాన్ని విడిచిపెట్టడం కష్టమన్నారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థులు, యువత, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: డ్రగ్స్ వినియోగం సమాజంలో సమస్యగా మారిందని యువత వాటి భారిన పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. మండల కేంద్రమైన నూజెండ్లలో మండల పరిషత్, రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాఠశాల విద్యార్థులతో కలిసి అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కూడలి నుంచి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎం.ఇ.ఓ.రవిచంద్ర, ఇ.వో.ఆర్.డి. రబ్బాని, డి.టి. బాల వెంకటేష్, ప్రదానోపాద్యాయులు ఘంటా నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట (యడ్లపాడు): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సుగాలి కాలనీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ సదస్సు జరిగింది. చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి ఆదేశాల మేరకు పలువురు న్యాయవాదులు పాల్గొని మత్తు పదార్థాలు, వాటి రకాలు, వినియోగం, వాటికి బానిసలైతే జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీవీహెచ్‌ఎస్ ప్రసాద్, న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, టి.రామాంజనేయులు, ఎం. భానుప్రసాద్, స్కూల్ ప్రిన్సిపాల్ పీవీ సుధారాణి, పారా లీగల్ వాలంటీర్స్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...



బొల్లాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బొల్లాపల్లి: అంతార్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వి.సుధాకర్ ఇన్‌చార్జి ఎంపీడీవో పి.సీతారామయ్యలతోపాటు మండల అధికారులు పాల్గొని మాదక ద్రవ్యాలవల్ల కలిగే దుష్పలితాలు ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



సొలసలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ బి. నిర్మల, ఎండీవో మాధ్యుబాబు



నరసరావుపేట హాస్పిటల్‌లో పోస్టర్లు ప్రదర్శిస్తున్న డాక్టర్లు, నర్సులు



చిలకలూరిపేటలో నిర్వహించిన సదస్సుకు హాజరైన న్యాయవాదులు

కూటమి మాలలకు తీవ్ర అన్యాయం చేసింది



వినుకొండ: రాష్ట్రంలో మాలలకు కూటమి పాలకులు తీవ్ర అన్యాయం చేశారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదాజాన్‌పాల్ ఆరోపించారు. స్థానిక సీపీఎం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన వర్గీకరణ సుప్రీం కోర్టులో కేసు కొట్టివేసిన అంశాన్ని తిరిగి మళ్లీ కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ పేరిట మాలలకు అన్యాయం చేసే విధంగా కుట్ర నడిచిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాల ఉద్యోగులపై మానసిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి ఎస్సీవర్గీకరణ పేరుతో ఏడాది కాలం వాయిదా వేసిందని విమర్శించారు. గ్రామాల్లో నేటికీ మాలపల్లెలో శ్మశాన వాటికలు లేవని మాలలకు న్యాయం జరుగని పక్షంలో ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గడిపూడి ఏసురత్నం, కొమ్మతోటి సుధాకర్, బొందలపాటి నాగేశ్వరరావులతోపాటు ఐదు మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు అవడంతో నిందితుడు బాపట్లకు చెందిన కంభంపాటి వెంకట రామ గోపాల శర్మకు ఏడాది జైలు, రెండు లక్షల రూపాయలు ఫిర్యాదుదారుడికి చెల్లించేలా, రూ. 5000 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ. సలోమి గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడు శర్మ 2015 మార్చి 5న ముప్పాళ్ళ మండలం గోల్లపాడు గ్రామానికి చెందిన గోపు కోటేశ్వరరావు వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా 2018 అక్టోబర్ 12న రెండు లక్షలకు చెక్కు ఇచ్చాడు. కోటేశ్వరరావు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వసూలుకు వేసుకోగా అది చెల్లలేదు. ఈ మేరకు ఆయన కోర్టులో కేసు దాఖలు చేయగా విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

అదనపు కట్నం వేధింపులపై ముగ్గురిపై కేసు

నాదెండ్ల: అదనపు కట్నం తీసుకురామని అత్తింటి వారు వేధిస్తున్నారంటూ వివాహిత ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు, కనపర్రు గ్రామానికి చెందిన షేక్ మనీషాకు ఐదేళ్ళక్రితం మహబూబ్ బాషాతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నారంటూ భర్త మహబూబ్‌బాషా, అత్త, మరొకరిపై ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మైనింగ్ సమస్యలపై ఆర్డీవో క్షేత్రస్థాయి విచారణ



ఉప్పరపాలెంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో మధులత

యడ్లపాడు: మైనింగ్ క్వారీయింగ్ వల్ల తమ గ్రామంలో పలు సమస్యలు నెలకొన్నాయంటూ జిల్లా గ్రీవెన్స్‌లో పెట్టుకున్న ఫిర్యాదు మేరకు ఆర్డీవో మధులత క్షేత్రస్థాయి విచారణకు వచ్చారు. గురువారం యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామస్తులు, మైనింగ్, పంచాయతీశాఖ అధికారులతో కలిసి చర్చించారు. గ్రామం పరిధిలోని కొండ క్వారీల్లో విస్తృతంగా జరిగే మైనింగ్ బ్లాస్టింగ్ వలన నివాసాలు బీటలు వారుతున్నాయని, అలాగే ఇక్కడి ప్రజలు పలు అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నట్లు అధికారులకు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు వెల్లడించారు. మైనింగ్ లీజుదారులు ఎంతమంది ఉన్నారు. వారికి ఏ ప్రాతిపదికన లీజు మంజూరు చేశారు. హద్దులు, కాల పరిమితి వంటి అన్ని అంశాలను వివరించాలని మైనింగ్‌శాఖ అధికారులను సమగ్ర వివరాలను తనకు అందించాలని కోరారు. అలాగే పంచాయతీ తీర్మానాలు ఏవైనా చేశారా అనే వివరాలను సేకరించాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీను ఆదేశించారు. ప్రస్తుత మైనింగ్ ప్రాంత పరిస్థితి, ఎవరు క్వారీయింగ్ చేస్తున్నారు, ఏ మేరకు చేశారు తదితర అంశాలపై మండల తహసీల్దార్, సర్వేయర్లు సమన్వయంగా సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

శావల్యాపురం: శ్రీఅడవి పేరంటాళ్లమ్మ సేవా సమితి సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని సర్పంచ్ చింతా విజయ్‌కుమార్ (అంకమ్మ) అన్నారు. గురువారం మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ సేవా సమితి సారథ్యంలో విద్యా సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ముండ్రు వెంకటేశ్వర్లు,బోడాల వీరాంజినేయులు, విశ్రాంతి వీఆర్వో చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, శ్రీఅడవిపేరంటాళ్ళమ్మ దేవాలయ ట్రస్టు చైర్మన్ గరిమిడి శ్రీనివాసరావు, ట్రస్టు ప్రతినిధి రసపుత్ర బాలాజీ సింగ్ ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలిక మృతి



యడ్లపాడు: వైద్య వికటించి బాలిక మృతి చెందిందంటూ జగ్గాపురం వాసులు ఓ మెడికల్ షాపు వద్ద ఆందోళన చేసిన ఘటన గురువారం రాత్రి కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీన జగ్గాపురం గ్రామానికి చెందిన బొంతు కోటేశ్వరరావు కుమార్తె శాలిని (9) అనారోగ్యంతో ఉన్నందున యడ్లపాడు గ్రామంలోని ఓ మెడికల్ షాపులో వైద్యం చేయించుకున్నారు. దీంతో బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బాలిక మృతి చెందింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు యడ్లపాడులో తాము వైద్యం చేయించిన షాపు వద్ద మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ టి.శివరామకృష్ణను వివరణ కోరగా జగ్గాపురంకు చెందిన కోటేశ్వరరావు భార్య ఫిర్యాదు చేయగా అనుమానాస్పద కేసుగా నమోదు చేశామన్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో వెలుగు చూడాల్సి ఉందని చెప్పారు.

5న వినుకొండలో జాతీయ లోక్ అదాలత్

వినుకొండ: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆదేశానుసారం జులై 5 వతేదీన మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వినుకొండ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో జాతీయ లోక్‌ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు మండలన్యాయ సేవాసంస్థ సభ్యులు గురువారం తెలిపారు. ఈకార్యక్రమంలోభాగంగా సివిల్, క్రిమినల్ కేసులు ఉన్న కక్షిదారులు ముందస్తు సమాచారం తెలియజేసి రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

కోడిగుడ్లతో వెళ్తున్న లారీ బోల్తా



చిలకలూరిపేట టౌన్: డ్రైవర్‌కు నిద్రమత్తు ఆవహించడంతో ఒంగోలు నుంచి గుంటూరు వైపు కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న మినీ లారీ బొప్పూడి పరిధిలో జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, మినీ లారీ పూర్తిగా ధ్వంసమైంది. కోడిగుడ్లన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడి పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది గాయాలైన డ్రైవర్‌ను చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గాల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయంలో గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు యూత్ విభాగ అధ్యక్షులుగా కుప్పల ప్రభుదాస్ నాయుడు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా ఏకాంబరపు సునీత, రైతు విభాగ అధ్యక్షులు తొట్టెంపూడి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షులు గుంజి శ్రీను, ఎస్‌సీ సెల్ అధ్యక్షులు కొచ్చర్ల శ్రీను, ఎస్‌టీ సెల్ అధ్యక్షులు బాణావత్ బాలకోటినాయక్ నియమితులయ్యారు. అలాగే మైనార్టీసెల్ అధ్యక్షులు అప్పాపురం షేక్ రమేష్ బాబు, విద్యార్థి విభాగ అధ్యక్షులు కావల దినకర్, అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలిగా దాసరి అంజలి, బూత్ కమిటీస్ వింగ్ అధ్యక్షుడు మానుకొండ శేషిరెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మైలా రాజేష్, కల్చరల్ వింగ్ అధ్యక్షులు బండ్ల శ్రీనివాసరావు, వలంటీర్ల విభాగ అధ్యక్షులు విడదల రవి శ్రీనివాసరావు, డాక్టర్ల విభాగ అధ్యక్షులుగా గొంతు రాహుల్ రెడ్డి నియమితులయ్యారు. గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులుగా బురదగుంట ప్రసన్నకుమార్, ఇంటలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షులు చిర్రా శ్రీనివాసరెడ్డి, ఐటి వింగ్ అధ్యక్షులు విడదల వంశీకృష్ణ, లీగల్‌సెల్ అధ్యక్షులు పల్లపు శ్రీనివాసరావు, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు షేక్ సాపా సైదావలి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు గోపవరపు విజయభాస్కర్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు పిల్లి సాగర్‌బాబు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షులు బెల్లంకొండ నరేంద్ర, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులు దొడ్డా రాకేష్ గాంధి, వాణిజ్య విభాగం అధ్యక్షులు కొప్పురావూరి పటేల్ నాగేశ్వరరావు, వీవర్స్ వింగ్ అధ్యక్షులు ఫణిదెపు కోటేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులుగా పఠాన్ దౌలత్‌ఖాన్ నియమితులయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాలపాడు ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల సంఖ్యపై సమీక్షించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 60కు పైగా పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి వారి మేథో శక్తిని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరుపై విద్యార్థులను ప్రశ్నించారు. రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని తెలిపారు.

మొక్కజొన్న సాగుపై ఆసక్తి

- వరి పంట సాగుకు పెరిగిన వ్యయం
- పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు సాగు చేయాలంటూ సూచన



ట్రాక్టరుతో దుక్కులు దున్నుతున్న రైతు

శావల్యాపురం: ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు. మండలంలో మెట్ట మాగాణి భూములు 15 వేల ఎకరాలు ఉంది. ఏరువాక పౌర్ణమి వేడుకలు తదుపరి రైతులు తమ పొలాల్లో పశువుల పేడను తొలుకునే పనులు చేస్తున్నారు. సేంద్రియ ఎరువులు పొలాల్లో వినియోగించడం వలన రసాయనిక ఎరువుల మోతాదు తగ్గటంతోపాటు సాగు చేసే పొలాల్లో అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. సాగు నీరు ఆధారంగా మెట్ట మాగాణి పంటల సాగుకు సంసిద్ధం అవుతున్నారు. వరి పంట సాగు చేయడం వలన ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవటం.. ఖర్చులు కూడా పెరగటం.. మార్కెటులో గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు ఆసక్తి సన్నగిల్లుతోంది.

గత సంవత్సరం...

గత ఏడాది ఖరీఫ్ సీజనులో వరి పంట జెజెఎల్ 384, ఎన్ఎల్ఆర్ 34449, కెఎన్‌యం రకం, బీపీటీ వరి రకం విత్తనాలు 4వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఖరీఫ్, రబీ సీజనుల్లో వరి పంట సాగు చేసిన రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రస్తుతం సాగు భూముల్లో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర సేంద్రియ ఎరువు తయారు చేసే పనులకు తమ పొలాలను రైతులు దుక్కులు దున్నుతున్నారు. గత ఏడాది మొక్కజొన్న పంట 5వేల ఎకరాల్లో సాగు చేయగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రావటంతో మార్కెట్‌లో మద్దతు ధర ఉండటంతో ఒక్కో ఎకరానికి 40 నుంచి 50 క్వింటాల దిగుబడులు రావటం క్వింటా ధర రూ.2200 కొనుగోలు చేయడంతో రైతులు మొక్కజొన్న పంట సాగుకు అధిక సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు. సాగు నీరు విడుదల ఆధారంగా పంటల సాగుకు రైతులు సంసిద్ధం అవుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com